12

# లూయీ పాశ్చర్

ఆయన చాలా అసాధారణమైన వ్యక్తి.

అంచేత ఆయనను కలవాలన్న ఆతురతతో ఎందరెందరో విందులకు పిలిచేవారు. కాని ఏ విందుకు వెళ్ళినా అతడు మొదట తన ఎదుట వుంచిన కంచాన్ని చేతుల్లోకి తీసుకుని చాలజాగ్రత్తగా పరిశీలించేవాడు. ఆ తర్వాత నేప్‌కిన్‌తో దానిని గట్టిగా తుడిచేవాడు, ఆ తర్వాతనే దానిలో ఏదయినా వడ్డించమనేవాడు. అతన్ని పిలిచిన గృహిణికయినా ఈ తతంగం అంతా చూస్తే వళ్ళుమండేది. అయినా ఏం చేయడం? ధూళి అతడికి బద్ధశత్రువు.

జీవితమంతా ధూళితో పోరాడిన ఆ వీరుడిపేరు లూయీపాశ్చర్. అంతవరకూ మానవాళి ఎరుగని అనేక మార్పులకు మూలకారణం సూక్ష్మ జీవులేనని కనిపెట్టిన ఈ శాస్త్రవేత్త కుక్కకాటు వలన సంక్రమించే రేబిస్ వ్యాధికి చికిత్స కనుగొన్నాడు. మత్తుపానీయాలు నిల్వమీద చెడకుండావుండే పద్ధతి, పట్టు పురుగులకు ఆధారమైన మల్బరీ చెట్లకు చీడనివారణ, పరాన్న భుక్కులవల్ల వచ్చే కీళ్ళ జబ్బుకోమందు, "యాంటిసెప్టిక్" విధానానికి దారి— ఇన్ని కనుగొన్న లూయీపాశ్చర్ 1822 డిసెంబరులో పుట్టాడు. పాశ్చర్ నాన్న సార్జెంట్ మేజర్ జీన్‌జోసెఫ్ పాశ్చర్, నెపోలియన్ క్రింద యుద్ధాలలో పాల్గొన్నాడు. అంచేతనే నెపోలియన్ చక్రవర్తి నాటి తన మాతృదేశపు కీర్తి ప్రతిష్టలను తండ్రినుండివిన్న లూయీకి— దేశం అంటే ప్రగాఢమైన అభిమానం వుండేది. అయితే ఆ అభిమానాన్ని అతడు తన మతమయిన సైన్సు ద్వారానే ప్రకటించాడు.

1870 లో ప్రష్యన్ సైన్యాలు ఫ్రాన్స్‌మీద దాడిచేసి, ఆదేశాన్ని ఆక్రమించుకోసాగాయి. అప్పటికే ప్రపంచ ఖ్యాతినందిన లూయీపాశ్చర్-పక్షవాతంతో ఎడమకాలు, చేయి చచ్చుపడిపోయినా, తన ఆలోచనా నైశిత్యాన్ని కోల్పోలేదు.

అతడప్పుడు తన విద్యార్థికిరాసిన ఒక ఉత్తరంలో-- "ఈనాడింత ఉత్తుంగ తరంగంలా జర్మనీ లేస్తున్నదంటే దానికి కారణం—— బుద్ధి, విద్య, క్రమశిక్షణలమీద జర్మనీకున్న గౌరవం. మన మిలా అణగారి పోతున్నామంటే మనలో ఆ గౌరవం సన్నగిల్లడంవల్లనే. బుద్ధికి శిక్షణకావాలి. అలా శిక్షణపొందిన జ్ఞానం ఆచరణ యోగ్యమైన ఫలితాలద్వారా దేశానికి దారి చూపాలి. అలా దారి చూపగల దీపమే సైన్సు; సైన్సు అభివృద్ధి అనేది జాతి ప్రగతికెంత ముఖ్యమో నైతిక జీవనానికీ అంతే ముఖ్యం!" అన్నాడాయన.

అంతకు రెండేళ్ళముందు అతడి వైజ్ఞానికకృషికి గుర్తింపుగా బాన్‌లోని జర్మన్ విశ్వవిద్యాలయం ఇచ్చిన గౌరవపట్టాను తిరిగి బాన్‌కుపంపించేస్తూ-" నాదేశాన్ని దోచుకుంటున్న మీ రాజు పేరున్న పత్రంలో నాపేరును చూడడంకన్న అసహ్యాకరమైన విషయంలేదు" అన్నాడు పాశ్చర్!

1870 - 71లో ఫ్రాన్స్ పరిస్థితి మరింత దిగజారింది. క్షతగాత్రుడయిన కొడుకుతో, భార్యతో స్విట్జర్‌లాండ్ చేరాడు పాశ్చర్, అతడి కొడుకు మామూలు మనిషివగానే మళ్ళీ పోరాటంలోకి వెళ్లాడు. పాశ్చర్ ఫ్రాన్స్‌లోని ల్యాన్స్ నగరం చేరాడు. కాని పారిస్ నగరం జర్మనీకి లొంగిపోయింది. లూయీపాశ్చర్ పదవికి ముప్పు ఏర్పడింది. అంతకు ఆరేడేళ్ళముందు అహర్నిశలు కృషిచేస్తూ, మధ్యలో తనకు పక్షవాతం వచ్చినా, అచంచల దీక్షతోలేచి, అలాగే పరిశోధనలుచేసి మల్బరీ చెట్లను, పట్టుపురుగులను ధ్వంసంచేస్తున్న సూక్ష్మజీవుల ఉనికిని కనుగొని ఆ పట్టు పరిశ్రమను కాపాడి దక్షిణ యూరపు, ఇటలీదేశాలకు మహోపకారం చేసిన

ఆమహానుభావుడిప్పుడు చితికిన దశలో వుండడం గమనించిన ఇటలీ — పాశ్చర్‌ను తమ దేశంలోని పిసా నగరంలో ప్రొఫెసర్‌గావచ్చి చేరమని ఆహ్వానించింది.

అందుకాయన- "కష్టకాలంలోవున్న నాదేశం నాకివ్వలేని పదవిని, డబ్బుని ఆశించి నేను పరాయి దేశం వెడితే మాతృద్రోహం చేసిన వాడినవు తాను. సైన్యాన్ని విడిచి పారిపోయిన సైనికుడివలెనే శిక్షకు అర్హుడి నవు తాను —" అని నిరాకరించాడు!

ఈనాడు అష్టకష్టాలూపడి మనదేశం సమకూరుస్తున్న ఉన్నత విద్యల నభ్యసించి, సుశిక్షతులవగానే పదవికోసం, పణంకోసం పరాయి దేశాల కెగబాకే మన మేధావులకూ, లూయీపాశ్చర్‌కూ ఎంతదూరం! ఆయనకు దేశం అమ్మయితే, మనకు దేశం నిచ్చెన. ఆయనకు దేశంయొక్క సుఖం లోను, కష్టంలోను భాగంవుంది. మనకు దేశంయొక్క సుఖంలో మాత్రమే పాలుకావాలి!

ఎంత తేడా!

"సైన్సుకు దేశంలేదు. కాని సైంటిస్టుకుంది. సైంటిస్టు ఎప్పుడూ తన జాతివైభవాన్ని దృష్టిలోపెట్టుకోవాలి. ప్రతీ గొప్ప సైంటిస్టులోనూ గొప్ప దేశభక్తుడుంటాడు. తన దేశానికి మేలుచేస్తానన్న మహదానందమే అతడికి ధైర్యస్థైర్యాల నిస్తుంది-" అన్న పాశ్చర్ మాటలు నేటి మన టోపీదాసులలో ఎంతమందికి రుచిస్తాయి?

జీవితమంతా సూక్ష్మక్రిముల ఉనికిని గుర్తించడానికి వెచ్చించిన పాశ్చర్ మొదటిసారిగా 1864లో- "సూక్ష్మజీవులనేవి శూన్యంనుంచి వస్తాయన్నది భ్రమ: అవి అన్నీ ప్రాణులవలెనే ఉత్పత్తి అవుతాయి." అన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించగానే-- అతడిమీద అనేకులు, ముఖ్యంగా మతం పేరిట కొందరు విరుచుకు పడ్డారు. అప్పుడాయన- నేను ప్రతి

పొదించినదానిలో మతం, వేదాంతం, నాస్తికత్వం, ఆస్తికత్వం...వీటిప్రసక్తే లేదు. అది ఒకసత్యం. పరిశోధనలు మొదలు పెట్టినప్పుడు... ఈ సూక్ష్మ జీవులు వాటంతట అవిగా పుడతాయని ఋజువయితే నమ్మడానికి నేను సిద్ధంగా వున్నాను. కాని నా ప్రయోగాలవలన అది అబద్ధం అని తేలింది. ఇంకా ఆదే నిజం అని నమ్మేవారెవరయినా వుంటే వారిని గుడ్డివారనే అనుకోవలసి వస్తుంది ..." అన్నాడు.

పాశ్చర్ కన్న సుమారు శతాబ్దం ముందు, పశువులను దారుణమైన వ్యాధి నుండి రక్షించే 'వేక్సినేషన్' (వెక్కా-పశువు) పద్ధతిని ఎడ్వర్డ్ జెన్నర్ కనుగొన్నాడు; అందులోంచి స్ఫోటకానికి వేక్సినేషన్ రూపొందింది. ఈ పద్ధతిని ఇతర వ్యాధుల నరికట్టడానికికూడా వాడవచ్చునని గ్రహించి లూయీ పాశ్చర్ కుక్క కాటుకు వేక్సిన్ తయారుచేయగలిగాడు.

దానిని మొదటిసారిగా 1885 జూలై 5న జోసఫ్ మెయిస్టర్ అన్న కుర్రవాడిమీద ప్రయోగించాడు. మెయిస్టర్‌ను ఒక పిచ్చికుక్క చేతులమీద, కాళ్ళమీద తొడమీద విపరీతంగా కరిచింది. ఆ కుక్కను వెంటనే కాల్చి చంపివేశారు. 12 ఇంజక్షన్ల తర్వాత ఆ బాలుడు సంపూర్ణ ఆరోగ్యాన్ని కోలుకొని స్వగ్రామం వెళ్ళిపోయాడు. మానవాళికి లూయీ పాశ్చర్ అలా మరొక వరాన్నీ ప్రసాదించాడు.

కాని ఈ కథ ఇక్కడితో ఆగలేదు. డా॥ డ్యూబో అన్న ప్రసిద్ధ జీవశాస్త్రవేత్త... లూయీ పాశ్చర్ జీవితచరిత్రను రాశాడు. అందులో ఆయన ఇలా పేర్కొన్నాడు.

"ఆ విధంగా పిచ్చికుక్క కాటునుండి కోలుకున్న జోసెఫ్‌మెయిస్టర్ కొన్నేళ్ళకు పారిస్‌లోని 'పాశ్చర్ ఇన్‌స్టిట్యూట్' గేట్‌కీపర్‌గా చేరాడు. అతడికి పాశ్చర్ ఇంజక్షనిచ్చి బాగుచేసిన 55 సంవత్సరాల తర్వాత... 1940లో జర్మన్‌లు ఫ్రాన్స్‌మీద దాడిచేసి పారిస్‌ను కైవశం చేసుకున్నారు. రు, పాశ్చర్ సంస్థలో ప్రవేశించి, ఆ భవనపు నేల మాళిగలో పాశ్చర్

శవపేటికను భద్రపరచిన గదిని తెరవమని ఆజ్ఞాపించగా, ఆ పని చేయ నిచ్ఛగించని జోసఫ్ మెయిస్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు."

పిచ్చికుక్కకాటునుండి రక్షింపబడిన జోసఫ్ పిచ్చిమనుషుల కాటుకు బలికావడం ఎంత శోచనీయం! ఈ అధికార మదాంధత అనే కాటుకు వేక్సిన్ ఎక్కడ వుంది?

తన యావజ్జీవితమూ విజ్ఞాన శాస్త్ర పాదపీఠంవద్ద నైవేద్యంగా సమర్పించిన మహాయోగి లూయీపాశ్చర్ తన అరవయ్యో ఏట ఒక సన్మాన సభలో చెప్పాడు.

"ఈ ప్రపంచమంతటా ఎటుచూసినా నాకు ఒక అనంత తత్వపు సంకేతాలు అగపడుతున్నాయి. వాటిని చూస్తుండగా ప్రకృతికన్న అతీత మైనది వున్నది - అన్ననమ్మకం మన ఎదల్లోపల్లవిస్తూంది. దేవుడంటే వేరేమీ కాదు, ఆ అనంతత్వానికి మనం కల్పించుకున్న ఒక రూపం మాత్రమే. మర్మగర్భితమైన ఈ అనంతత్వం మనిషి మనసు నేలినంతకాలమూ మనిషి దేవాలయాలు కడుతూనేవుంటాడు. కనపడే వస్తువుల కనపడని గుణాలను, శక్తులను గ్రహించిన గ్రీకు దేశస్తులు ఇంగ్లీషు భాషకు "**Enthusiasm**" (ఉత్సాహం) అన్న ఒక అద్భుతమైన పదాన్నిచ్చారు." "**En Theos**" అన్న గ్రీకు పదానికి "లోపలవున్న దేవుడు" అని అర్థం. సౌందర్యం, కళ, శాస్త్రం- వీటిలో ఏదో ఒకదానికి సంబంధించిని ఆదర్శానికి, ఎదలో గుడి కట్టిన ప్రతివాడూ ఆనందమూర్తి అవుతాడు. సౌందర్యోపాసన అయినా, కళారాధన అయినా, శాస్త్రశోధనయినా...ఏదయినా అనంతత్వపు వెలుగును ప్రతిబింబించేదే కదా!"

.. అన్నవాడు లూయీపాశ్చర్.
అతడొక విజ్ఞాన శాస్త్రవేత్త.
...అందుకనే

"వస్తువ్యామోహంలో పడి కొట్టుమిట్టాడుతున్న నేటి ప్రపంచంలో పరిశోధనా యోగమగ్నుడయిన మేధావి ఒక్కడే నిజమైన ఆస్తికుడు"- అన్నాడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్!